# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక అమలుకు సహకరించాలని 16వ ఆర్థిక సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.**
2. **పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ కోరిందని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా పేర్కొన్నారు.**
3. **జపాన్‌లో పర్యటిస్తోన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బృందం ఈరోజు బహుళ జాతీయ సంస్థలతో సమావేశం కానుంది.**
4. **తెలంగాణలో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.**
5. **నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను ఈ ఏడాది నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక అమలుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని 16వ ఆర్థిక సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులతో సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

..వాయిస్..35 సెకన్లు

--------------------------

పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ కోరిందని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న 16వ ఆర్థిక సంఘం నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమైంది. అనంతరం విజయవాడలో ఆర్థిక సంఘం ఛైర్మన్ పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రాల పన్నుల వాటా 42 శాతానికి పెరిగిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన అదనపు పాధాన్యత కోరుతున్నాయని ఆయన పేర్కొంటూ,

వాయిస్ .. 36 సెకన్లు

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిన్న జపాన్ చేరుకుంది. వారం రోజుల పాటు ఈ బృందం జపాన్‌లో పర్యటించనుంది. ఈ సందర్భంగా జపాన్‌లో భారత రాయబారి శిబు జార్జ్‌తో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. టోక్యోలోని ఇండియా హౌజ్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

కాగా ఈ రోజు టోక్యోలో సోని గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్‌తో సహా వివిధ సంస్థలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ సాయంత్రం రాష్ట్ర బృందం తొషిబా కర్మాగారాన్ని సందర్శించనుంది.

---------------------------

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రామాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులతో సమావేశం సందర్భంగా ఆయన పలు విషయాల్ని ప్రస్తావించారు. రాష్ట్రంలోని 13 వేల 371 గ్రామ పంచాయతీలు, 660 మండల పరిషత్తులు, 26 జిల్లా పరిషత్తులకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పించి బలోపేతం చేయాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆర్థిక సంఘం సహాయ సహకారాలు ఎంతో అవసరం చెప్పారు. ప్రతి గ్రామాన్ని డిజిటల్ పంచాయతీగా మార్చేందుకు వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సమస్యను పరిష్కరించాలని కేంద్ర అటవీ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వైసత్యకుమార్ యాదవ్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో నిన్న ఆయన సమావేశమై కొల్లేరు సరస్సు పరిరక్షణపై కేంద్ర మంత్రికి వివరించారు. కొల్లేరులో పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు అక్కడ నివాసముంటున్న ప్రజల ప్రయోజనాల్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

---------------------------

తెలంగాణలో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్-టీజీ రెడ్కోతో ఎకోరేస్ ఎనర్జీ, జీపీఆర్ఎస్ ఆర్య సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అనంతరం భట్టి విక్రమార్క పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటక రంగ కళాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి నిన్నపాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులకు

కందుకూరి రంగస్థల పురస్కారాలను అందజేసిన అనంతరం మంత్రి ప్రసంగించారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ ఏడాది నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ప్రకటించారు.

----------------------------

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, మద్దతు ధర కల్పిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్..23 సెకన్లు

----------------------------

నైరుతి బంగాళాఖాతంలో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీన పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

మరో వైపు తెలంగాణలో మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. పలుచోట్ల ఉరుములు మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40కి.మీ.ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

----------------------------

భారతరత్న, మాజీ రాష్ట్రపతి, తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి ఈరోజు. అధ్యాపకవృత్తికి వన్నె తెచ్చిన ఆయన తమిళనాడులోని తిరుత్తనిలోని తెలుగు కుటుంబంలో 1888 సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5న ఏటా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్నాం.

=====================